క్లుప్తంగా

29న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు



సుబ్రమణ్యస్వామి ఆలయం

గుడిపాల: మండలంలోని కందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో ఈ నెల 29వ తేదీన ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 28వ తేదీ మధ్యాహ్నం నుంచి రెండు రోజులపాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. అలాగే పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

బడ్జెట్‌లో ఉద్యోగులకు ప్రాధాన్యతనివ్వాలి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులకు ప్రాధాన్యతనివ్వాలని ఆపస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయాలన్నారు. ఉద్యోగుల ఆర్థిక బకాయిల చెల్లింపు, 12వ వేతన సవరణకు సంబంధించిన మధ్యంతరభృతి, కరువుభత్యం బకాయిలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని సూచించారు. ఉద్యోగుల ఆశలను వమ్ముచేయకుండా న్యాయం చేయాలని కోరారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం



చెక్కు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు ఆదివారం ఓ దాత నగదు విరాళం చేశారు. హైదరాబాద్‌కు చెందిన బాలాజీ రూ.1,01,116 చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది వాసు, విఘ్నేష్ ఉన్నారు.

నేడు గణిత శాస్త్ర అవధానం

గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలోని హైస్కూల్లో సోమవారం గణిత శాస్త్ర అవధానం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గణిత అవధాని అరుణ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులతో గణిత ప్రజ్ఞాధారణ(గణిత అవధానం) కార్యక్రమం జరుగుతుందని ఏపీ గణిత శాస్త్ర (మ్యాథ్స్) ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు ఎం.చంద్రమనాయుడు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వేపంజేరి హైస్కూల్ హెచ్‌ఎం, టీచర్లు, మండలంలోని వివిధ హైస్కూళ్లలోని గణిత టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ



దుర్యోధన, భీమసేన వేషధారుల సంవాదం

పాలసముద్రం: ఎస్‌ఆర్‌ఆర్ గ్రామంలో వెలసిన ధర్మరాజులస్వామి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన గధాయుద్ధం, దుర్యోధన వధ ఘట్టాలు రసవత్తరంగా సాగాయి. వేణుగోపాల నాట్య బృదంలో భీమసేనుడిగా మునిక్రిష్ణ, దుర్యోధనుడిగా శివయ్య వేషాధారణ ఆకట్టుకుంది.
కురుక్షేత్ర యుద్ధం ముగింపులో సర్వమూ కోల్పోయిన దుర్యోధనుడు అస్త్ర సన్యాసం చేసి గంగలో తపస్సుకు వెళ్లడాన్ని ప్రదర్శించారు. అప్పుడు భీమసేనుడు గంగలో తపస్సు చేస్తున్న దుర్యోధనుడిని తీసుకెళ్లి యుద్ధానికి ప్రేరేపించి, వధించడం ఆద్యంతం ప్రజలను ఆకట్టుకుంది. దుర్యోధనుడిని వధించే సన్నివేశాన్ని కళాకారులు రక్తికట్టించారు. ఈ సన్నివేశాన్ని తిలకించడానికి మండల పరిధిలోని ప్రజలే కాకుండా తమిళనాడు నుంచి వందలాదిగా తరలివచ్చారు.

అలరించిన బలి బండి కుంభాలు

వెదురుకుప్పం: పచ్చికాపల్లంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బలి బండి కుంభాల కార్యక్రమం అలరించింది. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి భారతి ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం సాగింది. సాయంత్రం బకాసురుని వేషధారి బలికూడుతో అమ్మవారి ఆలయాన్ని ప్రదక్షిణగా చేసి ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు బలికూడుతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా బాణసంచా పెద్ద ఎత్తున పేల్చి యువత సందడి చేశారు.

అధ్వానంగా తేనెబండ

ఎటు చూసినా పిచ్చిమొక్కలు.. పూడిక తీయని కాలువలు.. మురుగునీటి గుంతలు.. దుర్వాసన వెదజల్లే పరిసర ప్రాంతాలు.. పారిశుద్ధ్య లోపంతో రోడ్డుపై పేరుకున్న చెత్తాచెదారాలు.. విపరీతంగా వ్యాప్తి చెందిన దోమలు.. విజృంభిస్తున్న ఈగలు.. వెలగని వీధిదీపాలు.. స్వైరవిహారం చేస్తున్న శునకాలు.. రాత్రి వేళల్లో మందుబాబుల ఆగడాలు.. ఇదీ జిల్లా కేంద్రం చిత్తూరు నగరంలోని తేనెబండ దుస్థితి. ఈ క్రమంలోనే స్థానిక వీరభద్రకాలనీ మురుగుమయంగా మారిపోయింది. మహాత్మానగర్ సమీపంలోని నీవానదిలో చెత్తాచెదారాలతో కూడిన డ్రైనేజీ నీరు చేరుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ ప్రాంతాల దయనీయ పరిస్థితిని గుర్తించాలని స్థానిక ప్రజానీకం కోరుతోంది. సమస్యలు పరిష్కరించాలని విన్నవిస్తోంది.
– చిత్తూరు కార్పొరేషన్



నీవానదిలోకి చేరిన మురుగు



ఇళ్ల మధ్య మురుగునీటి గుంత





తేనెబండ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, వీరభద్రకాలనీలో..

ఘనంగా మునీశ్వరుని విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్న గ్రామస్తులు

గుడిపాల: మండలంలోని బుచ్చన్నకండ్రిగలో ఆదివారం ఘనంగా మునీశ్వరుని విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. అలాగే శాస్త్రోక్తంగా కుంభాభిషేకం జరిపించారు. ఈ సందర్భంగా ఉదయం ద్వితీయ కాల యాగశాల పూజ హోమం, తల్వార్చన, ఆడిసంతానం, విశేషద్రవ్య హోమం, మహాపూర్ణాహుతి చేపట్టారు. ఉదయం 9:30 గంటలకు మహాసంకల్పం, మహాకుంభాభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఉదయం 10.30 గంటల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్ధగిరిలో గురుపౌర్ణమి వేడుకలు



శ్రీ వీరాంజనేయ స్వామికి సుదర్శన హోమం



వ్రతం ఆచారిస్తున్న మహిళలు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఉదయం ఆలయంలో అర్చకులు స్వామివారికికి అభిషేకం చేయించారు. అనంతరం సుగంధ పరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి ధూప దీప నైవేద్య కై ంకర్యాలు సమర్పించారు. పూజ అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, మొక్కుబడులు తీర్చుకున్నారు.

భక్తి ప్రపత్తులతో సుదర్శన హోమం

గురు పౌర్ణమి సందర్భంగా ఆలయంలో అర్చకులు ఉభయదారులతో సుదర్శన హోమం నిర్వహించారు. అర్చకులు కలశ స్థాపన, ఆరాధన చేయించారు. అనంతరం వేదమంత్రాలు పఠనం చేస్తూ హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. హోమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి దంపతులు, ఆలయ ఈఓ హనుమంతరావు పాల్గొన్నారు. గురు పౌర్ణమి వేడుకలను తిలకించడానికి విచ్చేసిన భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేశారు. రాత్రి ఆలయంలో ఉత్సవ విగ్రహానికి అర్చకులు అభిషేకం, ప్రత్యేకంగా అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో కొలువైన వీరాంజనేయ స్వామి ప్రాకారోత్సవం చేస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్ధగిరికి విచ్చేసిన భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథలు, భజనలు నిర్వహించారు.

కాణిపాకం ఆలయంలో..

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని కల్యాణ వేదికలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. వ్యాసమహర్షికి ప్రత్యేకంగా పూజలు చేసి గురువందనం సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది కోదండపాణి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు నగరంలో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కట్టమంచి, కుమ్మరవీధి, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లోని సాయి మందిరంలో ఉదయం నుంచి రాత్రి వరకు అభిషేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కాగడ హారతి అందించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం మహిళలు వ్రతమాచరించారు. వీరి రాకతో ఆలయాలు కిటకిటలాడాయి.

కుష్టు వ్యాధి నివారణ సర్వే వేగవంతం

తవణంపల్లె: కుష్టువ్యాధి నివారణపై జరుగుతున్న సర్వేను వేగవంతం చేయాలని డీపీఎంఓ మణి సూచించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న లెప్రసీ సర్వేను జోగివారిపల్లెలో పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం గురించి వివరించారు. కుష్టువ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కుష్టువ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించినచో పూర్తిగా వ్యాధిని నయం చేయవచ్చుని తెలిపారు. ఆగస్టు 2వ తేదీ లోపు సర్వే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, ఏఎన్‌ఎం తులసి, ఆశా కార్యకర్త అశ్విని, అంగన్‌వాడీ కార్యకర్త వినాయకం పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



బంగారుపాళెం: టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బంగారుపాళెం: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ లక్ష్మయ్య అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని మహాసముద్రం టోల్ ప్లాజా వద్ద సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహన దారులకు ఆన్‌లైన్ ద్వారా జరిమానాలు వేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కారులో ప్రయాణించేవారు విధిగా సీట్ బెల్టు ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు పడిపితే లైసెన్సులు రద్దు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. వాహనదారులు రహదారి నింబంధనలు పాటించి వాహనాలు నడపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని తెలిపారు. ప్రమాదాల బారినపడితే తల్లిదండ్రులకు శిక్ష తప్పదన్నారు. వాహనాల తనిఖీలో ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది అస్గర్, బెనర్జీరావు, ద్వారకనాథ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ఐరాల: స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం అంటూ చిన్ననాటి తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు పూర్వ విద్యార్థులు. మండలంలోని ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్ 2003–2004 సంవత్సరం పదో తరగతి చదువుకున్న వారంతా ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆ నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. చిన్ననాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ కుటుంబ సభ్యులను మిత్రులకు పరిచయం చేశారు. 20 సంవత్సరాల తరువాత కలిసిన తాము ఈ మధుర స్మృతులను జీవితాంతం పదిల పరుచుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం అరుణ్‌కుమార్, తమకు విద్యాబుద్ధులు చెప్పిన అలనాటి గురువులు క్రిష్ణమనాయుడు, మనోహర్, కన్నయ్య, సుబ్రమణ్యంరెడ్డి, సరస్వతి, అన్వర్‌బాషా, దేవరాజులరెడ్డి, పురుషోత్తం నాయుడు, ఇందిర తదితరులను ఘనంగా సన్మానించారు. గురువులు తమ విద్యార్థులకు ఆశీస్సులు అందించారు.

బంగారుపాళెంలో..



ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలిమిట్టూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల 'గెట్ టు గెదర్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 2000–2001 సంవత్సరం 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు 24 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. అప్పట్లో చదువు నేర్పిన గురువులను పూర్వవిద్యార్థులు సన్మానించారు. చిన్ననాటి చదువుల జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగరాజ, విశ్రాంత హెచ్‌ఎంలు మునిరత్నం, చంద్రశేఖర్, సుజాత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం



బంగారుపాళెం: మాధవనగర్‌లో సత్యనారాయణస్వామి వ్రత పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మాధవనగర్ బ్రహ్మానందాశ్రమంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రత పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆశ్రమ నిర్వాహకుడు కేశవానంద స్వామి ఆధ్వర్యంలో శ్రీసత్య నారాయణస్వామి మూలవిగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయం ఆవరణలో స్వామివారి చిత్రపటాన్ని మండపంలో ఏర్పాటు చేసి సత్య నారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం కేశవానందస్వామి శ్రీసత్యనారాయణస్వామి వ్రత ఫలితం, గురు పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు కేశవానందస్వామిని భక్తులు సన్మానించి, పాదపూజలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. మండల కరణం సంక్షేమ సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం



బోయకొండలో నిర్వహిస్తున్న చండీ హోమం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో చండీ హోమాన్ని నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి ఉత్సవ మూర్తిని యాగశాలలో నెలకొల్పారు. ఆలయ ఉపకమిషనర్ ఏకాంబరం తోపాటు ఉభయదారులచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. ప్రతినెలా పౌర్ణమి రోజున నిర్వహించే ఈ చండీహోమ పూజలకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పూర్ణాహుతి అనంతరం అధికారులు, ఉభయదారులకు అమ్మవారి పవిత్ర తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేయించారు.

తెలుగుభాష రక్షణకు చర్యలు



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తెలుగు భాష రక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు కోరారు. పట్టణ సమీపంలోని కళామందిరంలో ఆదివారం 'తెలుగు భాష నూతన ప్రభుత్వం' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రభుత్వ ఉత్తర్వులన్నీ తెలుగులోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక విద్య నుంచి తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యతను కల్పించాలని సూచించారు. పలువురు కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవకుల అద్భుత అలంకరణ





కాణిపాకం ఆలయంలో కూరగాయలతో చేసిన అలంకరణలు





కాణిపాకం ఆలయంలో కూరగాయల అలంకరణ చేసిన శ్రీవారి సేవకులు

- కాణిపాకం ఆలయంలో కూరగాయలతో అలంకరణ

పలమనేరు: కాణిపాకం ఆలయంలో ఆషాడ పౌర్ణమి సందర్భంగా కూరగాయల అలంకరణ కోసం స్థానిక శ్రీవారి భక్తులు 15 టన్నుల కూరగాయలను వితరణగా పంపి ఆలయంలో వారే స్వయంగా కూరగాయలతో స్వామివార్లకు, ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా అక్కడి మగధాంబిక సమేత మణికంఠేశ్వరస్వామి ఆలయాల్లో శాకంబరి అలంకరణ చేశారు. ఏటా ఇక్కడి ఆలయంలో పట్టణానికి చెందిన శ్రీవారి భక్తులు కూరగాయలతో ఆలయాన్ని అలంకరిస్తుంటారు. ఈ అలంకరణకు సంబంధించి దాతల సాయంతో రూ.3.70లక్షల విలువజేసే కూరగాయలను సేకరించి కాణిపాకం ఆలయంలో అలంకరించినట్లుసందర్భంగా వారు తెలిపారు. వీరిని ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో స్థానిక శ్రీవారి భక్తులు రవీంద్రారెడ్డి, కిశోర్ స్వామి, మోహన్‌రెడ్డి, సత్యనారాయణశెట్టి పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం





ప్రసంగిస్తున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ శైలజ, హాజరైన మహిళలు

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ అనాపానసతి ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ శైలాజ వివరించారు. మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో మూడు రోజుల పాటు పత్రీజీ మహిళా చైతన్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ప్రసంగిస్తూ ది పవర్ ఆఫ్ మెడిటేషన్, ది పవర్ ఆఫ్ థింకింగ్, ది పవర్ ఆఫ్ మహిళా చైతన్యంతో పాటు 18 ఆదర్శ సూత్రాలు, 13 వ్యక్తిగత సూచనలతో ధ్యానం గురించి వివరించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ, గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అతిథి శైలజ సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. పత్రీజీ ఆశయ సాధనకు ధ్యానులు నడుం బిగించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా ధ్యానులు పాల్గొన్నారు.